క్లుప్తంగా

తులసీమాల అలంకరణలో వేంకన్న



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిన్నబజారులో ఉన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వామివారిని తులసీమాలలు, పూలమాలలతో అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

17న సంగీత విభావరి

శ్రీకాకుళం కల్చరల్: ఈనెల 17వ తేదీన నగరంలోని బాపూజీ కళా మందిర్‌లో ఘంటసాల వేంకటేశ్వరరావు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖకు చెందిన నారీభేరి సంస్థ, శ్రీకాకుళం సుకుమార్ ఆర్కెస్ట్రాల సంయుక్త నిర్వహణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన



తాళ్లవలసలో ఓ ఇంటి వద్ద నీటి నిల్వలు పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది

లావేరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సచివాలయాల ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ఇళ్ల వద్ద నీటి నిల్వలు పరిశీలించి తొలగించడం చేశారు. నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.

అదపాకలో పారిశుద్ధ్య పనులు



కాలువల్లో పూడికలు తొలగిస్తున్న కార్మికులు

లావేరు: అదపాక గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు శనివారం చేపట్టారు. పంచాయతీ సర్పంచ్ గొర్లె శశికళ, కార్యదర్శి జి.శ్రీనివాసరావుల పర్యవేక్షణలో కాలువలు, వీధుల్లో పేరుకుపోయిన పూడికలు, చెత్తను కార్మికులు తొలగించి ట్రాక్టరు ద్వారా గ్రామానికి దూరంగా తరలించారు. అలాగే మంచినీటి బోర్లు, కుళాయిలు వద్ద క్లోరినేషన్ చేయించారు.


ఆదిత్యున్ని దర్శించుకున్న సుదర్శనాచార్యులు



ఆదిత్యుని జ్ఞాపికను సుదర్శనాచార్యులకు అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్

అరసవల్లి: ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ క్వాలిటీ హెడ్ సుదర్శనాచార్యులు కుటుంబ సభ్యులతో తొలిసారిగా శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో వి.హరిసూర్య ప్రకాష్ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. వేదమంత్రోచ్చారణల నడుమ ఆశీర్వచనాన్ని నిర్వహించిన అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం సుదర్శనాచార్యులు మాట్లాడుతూ తమ కంపెనీ తరఫున ఆలయ అభివృద్ధికి సహకారాన్ని అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ప్రతినిధులు, అర్చకులు ఇప్పిలి క్షేమేంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఓసీటీ ఏర్పాటు



ఓసీటీ పరికరం

అరసవల్లి: రెటీనా రుగ్మతలను నిర్ధారించడానికి స్థానిక శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యశాలలో ఆధునిక ఓసీటీ (ఒక్యులర్ కోహరెన్స్ టోమోగ్రఫీ) ని ఏర్పాటు చేసినట్లు వైద్యశాల డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగారాజు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సీనియర్ రెటీనా సర్జన్ డాక్టర్ కృష్ణ మార్గదర్శకత్వంలో ఈ మిషన్‌ను అందుబాటులో ఉంచుతున్నట్లుగా ప్రకటించారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజా వైద్యానికే సీఎం తొలి ప్రాధాన్యం

- పేదలకు కార్పొరేట్ వైద్యం
- మంత్రి ధర్మాన ప్రసాదరావు



హెల్త్ సెంటర్ ప్రారంభించిన అనంతరం వైద్య సిబ్బందితో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజా వైద్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి ప్రాధాన్యమిస్తున్నారని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కి ఆనుకొని ఉన్న రామకృష్ణానగర్ కాలనీలో రూ.1.8 కోట్లతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్వాలిఫైడ్ డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, 63 రకాల పరీక్షలు, 170 రకాల మందులు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులను ఉపయోగించుకోవాలని ప్రజలను కోరారు. 8 డివిజన్లకు ఒక అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. మొత్తం నగరంలో 6 అర్బన్ హెల్త్ సెంటర్లు, ఒక జిల్లా కేంద్ర ఆస్పత్రి అందుబాటులో ఉన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వాస్పత్రుల్లో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతోందని తెలియజేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఆస్పత్రులు అభివృద్ధి చేయడమే కాకుండా, సిబ్బంది నియామకం చేపట్టామని వివరించారు. సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులను అర్బన్ హెల్త్ సెంటర్లకు చైర్మన్లగా నియమించామని, ఎటువంటి అసౌకర్యాలు ఉన్నా వారిని సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, డీఎంఅండ్‌హెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి, మాజీ మున్సిపల్ చైర్మన్ మెంటాడ పద్మావతి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, డాక్టర్ పైడి మహేశ్వరరావు, చల్ల శ్రీనివాస్‌రావు, చల్ల అలివేలు మంగ, కోణార్క్ శ్రీను, మండవల్లి రవి, ఆబోతుల రామ్మోహన్‌రావు, ఆలుగుబెల్లి నాగభూషణరావు, లుకలాపు గోవిందరావు, డాక్టర్ దానేటి శ్రీధర్, బలగ గణపతి పట్నాయక్, టంకాల బాలకృష్ణ, ఎండ రమేష్, తోట తారక్, పి.సుగుణారెడ్డి, వానపల్లి రమేష్, కళ్లేపల్లి రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి పండింది.. అరెస్టు జరిగింది

- టీడీపీ నాయకులది అనవసర రాద్ధాంతం
- కుట్రలకు కాలం చెల్లదు

టీడీపీ అధినేత చంద్రబాబు అవినీతి పాపం పండడంతోనే అరెస్టు జరిగిందని పలువురు వ్యాఖ్యానించారు. ఇన్నేళ్లకు చంద్రబాబు చేసిన కుట్రలు బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ కేసులో అవినీతి జరిగిందని తెలిసినా టీడీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. పచ్చ పత్రికలు, టీవీలను అడ్డం పెట్టుకొని రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని ప్రయత్నించడం మానుకోవాలని సూచించారు. అవినీతి చేయకుంటే విచారణను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. కాగా అరెస్టు నేపథ్యంలో టీడీపీ నాయకులు హడావుడి చేయాలని చూసినా ప్రజల నుంచి కనీసం మద్దతు లభించలేదు.

చట్టం ముందు అందరూ సమానమే



దేశంలో చట్టం ముందు అందరూ సమానమే. పీఎం అయినా ప్యూన్ అయినా ఒకటే. వ్యవస్థలు అందరికీ సమానమే. చంద్రబాబు అయినా, ఇంకెవరైనా తప్పు చేసినవారు శిక్షార్హులు అవుతారు. తప్పు లేకుంటే తగు ఆధారాలు చూపించి ఎదుర్కోవాలి. చంద్రబాబు వయస్సు రీత్య అవసరమైన సౌకర్యాలు కల్పించాలి.

– తంగి మురళీమోహనరావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

చట్టానికి అతీతులు కాదు



రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోరుకునేవారు ఎవరూ చంద్రబాబు అరెస్టును వ్యతిరేకించరు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ ఇన్నాళ్లు తప్పించుకున్నారు. ఇప్పుడు రోజులు మారాయి. తప్పుచేసి తప్పించుకుందామని అనుకుంటే కుదరదు. చంద్రబాబు ఆటలు ఇక సాగవు.

– పేడాడ వైకుంఠరావు, ఆక్వా రైతు, కొర్లకోట, ఆమదాలవలస

చట్టం దృష్టిలో అందరూ సమానమే



చట్టం దృష్టితో అందరూ సమానమే. మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు అరెస్టులో ఎటువంటి రాజకీయ కోణం లేదు. స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలో రూ. 550 కోట్లు అవినీతి జరిగిందని సీఐడీ తేల్చింది. వ్యవస్థలను మేనేజ్ చేసే చంద్రబాబు అరెస్టు అయ్యేసరికి టీడీపీ జీర్ణించుకోలేక పోతుంది. అవినీతి, వెన్నుపోటు రెండూ బాబుకు వెన్నతో పెట్టిన విద్య. అవినీతిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది.

– మొదలవలస చిరంజీవి, హైకోర్టు న్యాయవాది, ఎంపీపీ ఎచ్చెర్ల

కార్యకర్తలే కీలకం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తల కష్టమే కీలకమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం-1 గ్రామ సచివాలయంలో రణస్థలం పంచాయతీల గ్రామ నాయకులు అధ్వర్యంలో కార్యకర్తలతో ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో కార్యకర్తలు అహర్నిశలు కష్టపడి 2019లో పార్టీ విజయానికి దోహదపడ్డారని.. అదే స్ఫూర్తితో 2024 ఎన్నికల్లో పని చేయాలన్నారు. కార్యకర్తల శ్రేయస్సు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ బీమా రూ. ఐదు లక్షలు చేశారని చెప్పారు. ప్రతి కార్యకర్త బీమాను నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. అలాగే జగనన్న కుటుంబంలోనే వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు ఉన్నారని.. అందరూ కలిసి పని చేస్తే వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. అభివృద్ధి పనులు కూడా జోరుగా జరుగుతున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షులు కిల్లారి రమణ, నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, పిన్నింటి లక్ష్మునాయుడు, కరిమజ్జి భాస్కరరావు, మహంతి గురునాయుడు, జోగినాయుడు, సురేష్, కోటి, పైడిరాజు, భాస్కరరావు, కొమ్మోజు ఉమ, వార్డు మెంబర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో హిందూ జనసంఘ్ ఆధ్వర్యంలో భాస్కరభట్ల రామశర్మ నేతృత్వంలో హనుమాన్ చాలీసా పారాయణ సామూహికంగా శనివారం జరిగింది. జిల్లా అధ్యక్షుడు చిరంజీవులు మాట్లాడుతూ సమాజంలో సనాతన ధర్మాన్ని పరిరక్షించడం, హిందూ ధర్మం మూలాలను ప్రతిష్టించడంలో భాగంగా పారాయణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ నీలాద్రి, సెక్రటరీ బీవీ సత్యనారాయణ, రామకృష్ణ, జయరాం, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు

జి.సిగడాం: గర్భిణులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని బాతువ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ అనుషా, ప్రతిజ్ఞశర్మ అన్నారు. ఆరోగ్యకేంద్రంలో గర్భిణులకు శనివారం ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు.

కొనసాగుతున్న జన్మాష్టమి వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ దీప

బూర్జ: మండల కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కొనసాగుతున్నాయి. నాలుగో రోజు శనివారం ఎంపీపీ కర్నేన దీప హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నూతన క్లబ్‌లు ఏర్పాటు చేయడమే లక్ష్యం

- లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ గోపాలరావు



రక్తదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సేవలను ప్రజలకు చేరువ చేస్తూ నూతన క్లబ్‌లు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పని చేయాలని క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎ.గోపాలరావు అన్నారు. నగరంలోని సానావీధిలో ఉన్న లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి కార్యాలయంలో డిస్ట్రిక్ట్ గవర్నర్స్ డే లాంగ్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు క్లబ్‌లో 13.50 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని, రానున్న రెండేళ్లలో దీనిని 15 లక్షలకు పెంచే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ప్రతి జోన్ పరిధిలో రెండు క్లబ్‌లు ఏర్పాటయ్యేలా చూడాలని కోరారు. అనంతరం శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.వి.బి.ఎస్.ఎస్ ప్రసాద్, రెండో వైస్ ప్రెసిడెంట్ డి.సూర్య ప్రకాష్, జిల్లా క్యాబినెట్ సెక్రటరీ విప్పల ప్రసాద్, జిల్లా ట్రెజరీ పి.కాళిదాస్, తిరుమల శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షుడు హారికా ప్రసాద్, అధ్యక్షులు కరణం శోభారాణి, సెక్రటరీ శ్రీనివాసరావు, కోశాధికారి తర్లాడ అప్పలనాయుడు, జె.ఎన్.టి.నాయుడు, పాలిశెట్టి మధుబాబు, కొమ్ము రమణమూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

29 మందికి కంటి వైద్య పరీక్షలు

కొత్తూరు:

మండలంలోని బలద గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా స్థానిక సీహెచ్‌సీకి చెందిన ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య కంటి పరీక్షలను శనివారం నిర్వహించారు. 29 మంది వృద్ధులకు పరీక్షలు నిర్వహించి, నలుగురికి అంతర కుసుములు ఉన్నట్లు గుర్తించారు. వారికి ఈనెల 27వ తేదీన శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యంత విలువైన ఐఓఎల్ ఆపరేషన్ చేయించడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో బలద ఎంఎల్‌హెచ్‌పీ జి.సృజన, ఏఎన్ఎం పావని, హెచ్ఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిక్ జానకిరామయ్య

ఘనంగా తంగి సత్యనారాయణ జయంతి



తంగి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: స్థానిక బ్రిడ్జిరోడ్ దత్త కోవెల సమీపంలో దివంగత తంగి సత్యనారాయణ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన కుమారులు తంగి చంద్రశేఖర్, వేణుగోపాల్, శ్రీపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు హాజరై, తంగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు స్పీకర్‌గా, మంత్రిగా తంగి అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయితీరాజ్ విభాగపు అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, తంగి ఈశ్వరరావు, తంగి రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు తలసేమియా వ్యాధి పిల్లల కోసం శనివారం రక్తదానం చేశారు. శ్రీకాకుళానికి చెందిన జేసీఐ స్వచ్ఛంద సంస్థ రక్తం సేకరించింది. రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు విద్యార్థులను అభినందించారు.

యూరియాకు ప్రత్యామ్నాయంగా జీవామృతం

గార:

యూరియాకు ప్రత్యామ్నాయంగా జీవామృతం వాడడం వలన మొక్కలకు అనేక రకాల పోషకాలు అందుతాయని ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి గణమ్మ అన్నారు. మండలంలోని కె.సైరిగాంకు చెందిన ప్రసాదరావు వరి పొలంలో జీవామృతం తయారీపై శనివారం అవగాహన కల్పించారు. జీవామృతం వలన మొక్కలకు సూక్ష్మ, స్థూల పోషకాలు సులువుగా అందుతాయని, మొక్కల ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా భూమి సారవంతమవుతుందని, మొక్క సహజ పద్ధతిలో పెరుగుతుందని తెలియజేశారు. రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

సారవకోట:

గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని బుడితి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ డి.సుజాత సూచించారు. మండలంలోని గోపాలపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు అన్ని రకాల విటమిన్లతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని, దీంట్లో ఎక్కువగా ఐరన్ ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది సూచించిన వ్యాక్సిన్లు సమయానికి వేసుకోవాలన్నారు. ఆమెతో పాటు ఏఎన్ఎం లక్ష్మి తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుజాత

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం


సారవకోట: మండలంలోని గొర్రిబంద పంచాయతీ బురుజువాడ గ్రామంలో నీలమణి అమ్మవారు, గ్రామదేవత ఆలయాల ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 1500 మందికి అన్న సంతర్పణ చేపట్టారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

చెత్తకు చెల్లుచీటి..!

- బయో రెమిడేషన్ ద్వారా విచ్ఛిన్నం
- చర్యలు తీసుకుంటున్న నగరపాలక సంస్థ



చెత్తను విచ్ఛిన్నం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: నగరంలో పూర్తిగా చెత్తలేని ఆవాస ప్రాంతాలు ఉండేలా శ్రీకాకుళం నగరపాలక సంఘం సమర శంఖం మోగించింది. గడిచిన 20 సంవత్సరాలుగా నగరంలో సేకరించిన రెండున్నర లక్షల మెట్రిక్ టన్నుల చెత్త మండల కేంద్రంలోని తండేవలస డంపింగ్ యార్డ్‌లో నిల్వ ఉన్న విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుతం ఈ చెత్తను బయో రెమిడేషన్, బయో మైనింగ్ ప్రక్రియ ద్వారా విచ్ఛిన్నం చేయనున్నారు. అటు సెంట్రల్ గవర్నమెంట్, ఇటు నగరపాలక సంస్థతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కలిసి ఒక్కో శాఖద్వారా వస్‌థర్డ్ నిధులతో కలిపి సుమారు రూ.18 కోట్లు మంజూరు చేశారు.

ఇలా ఉపయోగిస్తారు...

వారియర్ మిషన్ ద్వారా చెత్తను నాలుగు విభాగాలుగా వేర్వేరు పద్ధతుల్లో సేకరిస్తున్నారు. ఒక మిషన్ ద్వారా పొడి ఎరువును, మరో దానిగుండా ప్లాస్టిక్ వ్యర్థ్యాలను, ఇంకోదానిగుండా రాళ్ల రప్పలను వేరుచేయడంతోపాటు మరో మిషన్ ద్వారా ఐరన్ వస్తువులను వేరుచేస్తోంది. ఆయా మిషన్ ద్వారా విచ్ఛిన్నం చేస్తూ సేకరించిన చెత్తను ఎరువుల తయారీకి, మండే స్వభాగం గల వాటిని సిమెంట్ ఫ్యాక్టరీలకు, విద్యుత్ తయారీకు ఉపయోగించనున్నారు. మిగిలిన మెటల్ పదార్థాలను సైంటిఫిక్‌గా రీసైక్లిబుల్ చేయనున్నారు.



మిషన్ల ద్వారా చెత్తను పొడిగా చేసిన దృశ్యం

మార్చి నాటికి చెత్తలేని నగరం



తండేవలసలోని పందొమ్మిదిన్నర ఎకరాల ల్యాండ్‌ను రీక్‌లెమ్ చేసే ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటివరకూ 75వేల మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ చేయడం జరిగింది. వచ్చే ఏడాది మార్చి నాటికి శ్రీకాకుళం నగరాన్ని పూర్తిగా చెత్తలేని నగరంగా తీర్చుదిద్దుతాం.

– చల్లా ఓబులేషు, శ్రీకాకుళ నగర కమిషనర్

ప్రతిరోజూ చెత్త సేకరణ

శ్రీకాకుళం నగరంలో ప్రతిరోజూ చెత్త సేకరణ జరుగుతోంది. ఏరోజు చెత్త అదేరోజు తరలిస్తున్నాం. తండేవలసలోని డంపింగ్ యార్డ్ కేంద్రానికి రోజుకు 30 టన్నుల చెత్తను తరలిస్తున్నాం. అక్కడకు తీసుకెళ్లిన చెత్తను పారబోసాక, వారియర్ మిషన్ల ద్వారా చెత్త విచ్ఛిన్నం చేస్తున్నారు.

– రాజు, శ్రీకాకుళం శానిటరీ మేస్త్రీ

జిల్లేడు ద్రావణంతో తెగుళ్ల నివారణ

ఎల్.ఎన్.పేట: పంటను ఆశించే అనేక తెగుళ్లను జిల్లేడు ద్రావణంతో నివారించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం మెంటర్ ఎం.పద్మావతి అన్నారు. మండలంలోని పెద్దకొల్లివలస గ్రామంలో శనివారం ప్రకృతి వ్యవసాయం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు పంట పెట్టుబడి తగ్గించుకుంటే ఆదాయం పెరుగుతుందన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం వలన భూసారం తగ్గుతుందన్నారు. పంటకు పోటాషియం ఎంత ఉపయోగపడుతుందో పోటాషియం స్థానంలో జిల్లేడు ఆకుల ద్రావణం అంతే ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంటి సూర్యనారాయణ, ఎల్-1 జగన్, ఐసీఆర్‌పీ సిబ్బంది రమణమ్మ, సుభాషిణి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం నేడు

నరసన్నపేట: స్థానిక లక్ష్మీ టాకీస్ వద్ద కల్యాణ మండపంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నామని కమిటీ ప్రతినిధి పొట్నూరు సాయి తెలిపారు. 1988లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు కలుస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాల్లో ఉన్నవారు వస్తున్నారని పేర్కొన్నారు. సినీ నటుడు ప్రభాస్ శ్రీను తదితరులు హాజరు కానున్నారని వెల్లడించారు.